క్లుప్తంగా

కుల గణన సర్వే పరిశీలన



కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లె గ్రామంలో జరుగుతున్న కుల గణన సర్వేను ఈవోపీఆర్డీ పి.సత్యప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. సర్వేను వేగవంతం చేయాలని ఈ నెల 28లోపు అయ్యేలా చూడాలని సర్వే సిబ్బందికి సూచించారు. గత శనివారం నుంచి మండలంలోని వివిధ గ్రామాలలో కుల గణన సర్వే ప్రారంభమైందని, అన్ని ప్రభుత్వ శాఖల క్షేత్ర స్థాయి సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

15 క్వింటాళ్ల మిర్చి దగ్ధం



గురజాల : 15 క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం...మండల పరిధిలోని పల్లెగుంత గ్రామానికి చెందిన ధీకొండ రమణ కుమార్, శ్రీనివాసరావుకు చెందిన మిరపకాయలు కల్లంలో ఆరబెట్టారు. ఎండిన తరువాత అమ్మి అప్పులు తీర్చుకుందామని అనుకున్నారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు మిరపకాయలు తగులబెట్టారు. సుమారు 15 క్వింటాళ్లకు రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

జాజికి రాజ్ భవన్ నుంచి ఆహ్వానం

కారెంపూడి: పర్యావరణవేత్త, సాక్షి ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత కారెంపూడికి చెందిన కొమెర అంకారావు (జాజి)కి రాజ్ భవన్ నుంచి బుధవారం ప్రత్యేక ఆహ్వానం అందింది. గణతంత్ర దినోత్సవం జనవరి 26 సాయంత్రం 4 గంటలకు రాజ్ భవన్‌లో జరగనున్న ఎట్‌హోమ్ కార్యక్రమానికి రాజ్ భవన్ నుంచి సంబంధిత అధికార వర్గాల ద్వారా జాజికి ఆహ్వానం అందింది.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి

పిడుగురాళ్ల: సామాన్య ప్రజలకు, న్యాయ సేవల సంస్థలకు మధ్య అంతరాన్ని పూడ్చేందుకు వ్యవహరించే వారధి వంటి వారే పారా లీగల్ వలంటీర్లు అని పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మురళి గంగాధరరావు బుధవారం తెలిపారు. పారా లీగల్ వలంటీర్ల కోసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, మంచి గ్రహణ శక్తి, మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని, సమాజంలోని అట్టడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం శ్రద్ధ వహించే మనస్తత్వం కలిగి ఉండాలన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోపు దరఖాస్తులను పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పోస్టు ద్వారా గానీ, నేరుగా గానీ అందించవచ్చునని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, లా విద్యార్థులు వారి బయోడేటాను పాస్‌పోర్ట్ ఫొటో అంటించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమ మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు

మాచవరం: బల్లకట్టు, నాటు పడవలు, మర పడవల ద్వారా గానీ అక్రమంగా తెలంగాణ మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని గురజాల డీఎస్పీ పల్లపురాజు హెచ్చరించారు. మండలంలోని గోవిందాపురం బల్లకట్టు రేవు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును బుధవారం సందర్శించారు. బల్లకట్టు నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉన్నాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర సరిహద్దు కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ ఆదేశాలు బేఖాతరు చేస్తే బల్లకట్టును సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు అనుగుణంగా బల్లకట్టు నిర్వహణ ఉండాలని సూచించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ సమీర్‌బాషా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

క్రోసూరు: రాష్ట్ర ఎన్నికల ఆధికారి అదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఈవీఎం యంత్రాల వినియోగం పట్ల బీఎల్‌వోలు, వీఆర్వోలు, పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ జియావుల్ హక్ బుధవారం తెలిపారు. మండలంలోని ఆవులవారిపాలెం, పెరికపాడు గ్రామాల్లో అవగాహన కల్పించటం జరిగిందన్నారు. పార్టీల గుర్తులు, వేసిన ఓటు సక్రమంగా పడిందా అనే విషయాలు తెలుసుకునే విధంగా మాక్ పోలింగ్ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కుల గణన సర్వే

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఆర్థిక సంక్షేమానికి చేయూతనిస్తూ స్థానిక, నామినేటెడ్ పదవులలోనూ రాజకీయంగా 50శాతం రిజర్వేషన్ ఇస్తూ సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. బడుగు, బలహీన వర్గాల చిరకాల వాంఛను నెరవేరుస్తూ కులగణనకు శ్రీకారం చుట్టింది. జగనన్న చరిత్రాత్మక నిర్ణయానికి బీసీ సంఘ నాయకులు నీరాజనం పడుతున్నారు.

- సామాజిక వర్గాల మెరుగైన జీవనానికి ప్రభుత్వం చర్యలు
- కులగణన సర్వేపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘ నాయకులు



తాళ్ళపల్లిలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది

మాచర్ల రూరల్: సమాజంలో వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించేందుకు మెరుగైన విధానాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన బృహత్తర కార్యక్రమం చేపట్టింది. దేశంలో మొట్టమొదటి సారిగా బీసీ కులాల సర్వేను సీఎం జగన్ చేపట్టారు. ఈ సర్వే కోసం ప్రత్యేకంగా మొబైల్ అప్లికేషన్ రూపొందించారు. గ్రామ/వార్డు సచివాలయ శాఖ నోడల్ డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరిస్తుంది. ఈ నెల 28వ తేదీ వరకు ఈ సర్వే సచివాలయ ఉద్యోగులతో వేగంగా కొనసాగుతుంది.

పెరుగుతున్న జనాభా ప్రకారం బీసీ జనాభా ఇంత మంది ఉన్నారని చెబుతున్నారే తప్ప అందులో కులాల ప్రకారం గణాంకాల వివరాలు లేవు. దీని వలన వివిధ రకాల ప్రభుత్వ పథకాలను అందుకునే వారు నష్టపోతున్నారు. వివిధ రంగాలలో వెనుకబడిన కులాలను గుర్తించి వారి అభివృద్ధి ముఖ్యంగా ప్రత్యేక పథకాలు, సంక్షేమ పథకాలు అందించాలన్నది ప్రభుత్వ సర్వే ఉద్దేశం. ఇప్పుడున్న దానికంటే మెరుగైన విధానాన్ని రూపకల్పన చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఎన్నో ఏళ్ల నుంచి కులగణన నిర్వహించాలని ప్రభుత్వాలను కోరినా పట్టించుకోలేదు. సీఎం జగన్ నేతృత్వంలో ప్రభుత్వం ఈ బాధ్యతను తీసుకొని సర్వే చేయిస్తున్నారు.

సర్వేలో సేకరించే అంశాలు

కుటుంబ సభ్యుల వివరాలు, యజమాని ఆధార్, బియ్యం కార్డు నెంబర్, మతం, కులం, ఉపకులం, వివాహ స్థితి, విద్యార్హత, పంట భూమి, ఆదాయం వంటి వివరాలు సేకరిస్తారు.

సర్వే వేగవంతం:ఎంపీడీఓ సరోజనీదేవి

ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర కులగణన సర్వే మండలంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామాలలో సర్వే వేగవంతంగా చేయిస్తున్నాం. ఇప్పటి వరకు 60 శాతంపైగా పూర్తి చేశాం. ప్రజల సహకారం బాగుంది. నిర్దీత సమయంలో పూర్తి చేస్తాం.

జగనన్నకు ఋణపడి ఉంటాం..



ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వాలను బీసీ గణన చేపట్టాలని వేడుకున్నా, ఉద్యమాలు చేసినా స్పందించలేదు. బీసీ పక్షపాతి అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయం. మా జనాభా తెలిసేలా, మా ఆర్థికాభివృద్ధి కోసం సర్వే చేపడుతున్న జగనన్నకు ఋణపడి ఉంటాం..

– డాక్టర్ జింకల నాగేశ్వరరావు,
బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కులగణన చరిత్రాత్మక నిర్ణయం..



దామాషా జనాభా ప్రకారం మాకు రావాల్సిన వాటాను ఇప్పటి వరకు పొందలేక వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న మాకు ఈ కుల గణన సర్వే దోహదపడుతుంది. జనాభాలో మా సంఖ్య తెలిసి మా ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ముదిరాజులు మొత్తం అండగా ఉంటాం.

– తాళ్ళ కొండలు, మాజీ కౌన్సిలర్,
ముదిరాజ్ సంఘ నాయకులు

బీసీల ఆర్థికాభివృద్ధికి జగనన్న చేయూత..



ఎన్నో ఏళ్ల నుంచి బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకొని వదిలివేసిన పార్టీల నాయకులకు భిన్నంగా బీసీలంటే బ్యాక్ బోన్ క్యాస్ట్ అని నిరూపిస్తూ మా సంఖ్యా బలాన్ని తెలియజేసి, మా ఆర్థిక, రాజకీయ అభివృద్ధి కోసం కులగణన చేపడుతున్న జగనన్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన తీసుకున్న నిర్ణయానికి బీసీలంతా ఆయన వెన్నంటే నిలుస్తాం.

– చల్లా కాశయ్య,
వడ్డెర సంఘ సీనియర్ నాయకులు

పల్లె ప్రజల రక్ష.. ఆరోగ్య సురక్ష



ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మధుసూధన్

గురజాల : పేదలకు ఆరోగ్య రక్షణ అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. దేశంలోనే ఎవరూ, ఎప్పుడూ ప్రజారోగ్యానికి సంబంధించి ఇటువంటి కార్యక్రమం ఏ ప్రభుత్వం చేపట్టలేదన్నారు. వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇంటి వద్దకే వైద్య సేవలు కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ పేరుతో వినూత్నంగా నిర్వహించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పెషలిస్టు వైద్యులను తీసుకువచ్చి ప్రజలకు వైద్య సేవలందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, కౌన్సిలర్ బండి రవికుమార్, కుక్కమూడి అనిల్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్, తదితరులున్నారు.

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని జలగల బజార్‌లో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య ఈ శిబిరం ప్రారంభించారు. డాక్టర్లు మధుసూదన్, సుచరిత, అమూల్య ఈ కార్యక్రమంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

పిడుగురాళ్ల: పట్టణంలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేయటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఉదయం 11 గంటలకు పార్కు స్కూల్, 11.30 గంటలకు ఎంపీడీవో కాంపౌండ్, 12 గంటలకు గుళ్లపల్లి డొంక, 12.30 చైతన్య బాలకుటీర్, 1 గంటలకు సత్య సాయి కల్యాణ మండపంలో నిర్వహించటం జరుగుతుందన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన



దుర్గి: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పోలింగ్‌కు కేటాయించిన ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఎస్ఐ ఎస్ కోటయ్య పరిశీలించారు. మండలంలోని ఓబులేశునిపల్లె, దుర్గి, కంచరగుంట, కోలగుట్ల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను పోలింగ్ బూత్‌లుగా కేటాయించటంతో వాటిని పరిశీలించేందుకు వచ్చినట్లు ఎస్ఐ కోటయ్య పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరిసర ప్రాంతాలు, మౌలిక వసతుల గురించి హెచ్‌ఎంలను వివరాలడిగి తెలుసుకున్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో శాంతిభద్రతల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

పంటల సాగుపై సమీక్ష

క్రోసూరు: క్రోసూరులోని కటకం కల్యాణ మండపంలో క్రోసూరు సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, రైతుభరోసా సిబ్బందితో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కంది కొనుగోలు, మద్దతు ధరలపై అవగాహన కల్పించారు. సబ్‌డివిజన్ పరిధిలో సాగవుతున్న పంటల విస్తీర్ణం, పంట నమోదు, ఈ పంట ఈకేవైసీ, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల అమ్మకాలు, పంట కోత ప్రయోగాలు, వైఎస్సార్ యాప్ నిర్వహణ తదితర అంశాలపై సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు.

బాలికలు ఉన్నతంగా ఎదగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్



దాచేపల్లి ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మాచవరం: బాలికలు విద్యలో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ అన్నారు. మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికలకు అవగాహనా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు చెప్పారు. బాలికా సంరక్షణ, బాల్య వివాహాలు, లింగ వివక్ష, బాలల హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న బంగారు తల్లి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ శ్రీవల్లి, హెచ్‌ఎం సురేష్‌బాబు, సెక్టార్ సూపర్‌వైజరు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిది

దాచేపల్లి : బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం బుధవారం నిర్వహించారు. బాలికలను చదివించాలని, బాల్య వివాహాలు చేయవద్దని అన్నారు. బాలికల చదువు కోసం ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని, ప్రభుత్వం కల్పించిన అవకాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఎస్.రవికుమార్, స్థానికులు ఐనాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కలిగి ఉంటే చర్యలు తప్పవు

సెబ్ సీఐ వెంకటరమణ



గురజాల : అక్రమ మద్యం కలిగి ఉంటే ఎంతటివారినైనా సహించేది లేదని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) సీఐ వెంకటరమణ అన్నారు. స్థానిక సెబ్ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ గత రెండు రోజులుగా దాడులు నిర్వహించి పల్లెగుంత గ్రామంలో ఒక వ్యక్తి వద్ద 10 క్వార్టర్ బాటిళ్లు, గురజాల బస్టాండ్ సమీపంలో ఒక వ్యక్తి వద్ద 29 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారికి 41ఏ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నాటు సారా, నిషేధిత పదార్థాలు కలిగి ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నూతన సెబ్ ఎస్ఐగా రవికుమార్

స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో నూతన ఎస్ఐగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన జయరాం బదిలీపై వెళ్లగా డీటీఎఫ్ బాపట్ల నుంచి బదిలీపై వచ్చిన రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

బెల్లంకొండ: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన బెల్లంకొండ క్రాస్ వద్ద మంగళవారం రాత్రి సమయంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ కె.అమీర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్లకు చెందిన షేక్ నన్నేసా సత్తెనపల్లి నుంచి తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. రాజుపాలెం మండలం చౌటపాపాయపాలెం ఆర్‌ఆర్ సెంటర్‌కు చెందిన చేవూరి నాగరాజు అనే వ్యక్తి రాజుపాలెం వైపు తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు అదుపు తప్పి వేగంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నన్నేసా తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అతడిని హుటాహుటిన సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున నన్నేసా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మాట నిలబెట్టుకున్న జగన్ ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



జగన్ ప్రభుత్వమే కావాలని చేతులు ఎత్తి చూపిస్తున్న మహిళలు

- డ్వాక్రా మహిళలకు నాల్గవ విడత రుణమాఫీ
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మాట నిలబెట్టుకునే ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇచ్చిన మాటను నెరవేర్చిన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లెనిన్ యూపీహెచ్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని 1, 33, 31, 32, 33 వార్డుల మహిళలకు లెనిన్ నగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చెక్కులను అందజేశారు. అలాగే 28, 29, 30 వార్డులకు చెందిన డ్వాక్రా మహిళలకు పిల్లుట్ల గుడిలోని నాగుల గుడి వద్ద చెక్కులను అందజేశారు. 25, 27 వార్డుల డ్వాక్రా మహిళలకు చెరువు కట్ట పంప్ హౌస్ వద్ద, 19, 20, 21, 22 వార్డులకు గాంధీనగర్ సచివాలయం, 23, 24, 26 వార్డులకు రైల్వే స్టేషన్‌లోని అన్నెం టవర్స్ నందు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మాట తప్పి మొండిచెయ్యి చూపించారన్నారు. 2019లో రాష్ట్ర ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా మహిళలకు నేడు నాల్గవ దఫా రుణమాఫీ అందించటం జరిగిందన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో సుమారు 500 పొదుపు సంఘాల మహిళలకు రూ.11.98 కోట్ల రుణమాఫీ చేయటం జరిగిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం కష్టమైన పని, ఎంతటి కష్టమైన ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఇష్టంగా పని చేసే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. అలాగే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వలంటీర్లను, సచివాలయాలను తీసివేస్తామని పగటి కలలు కంటున్నారు. మీకు వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ కావాలా, జన్మభూమి కమిటీలు కావాలా అని ఎమ్మెల్యే ప్రశ్నించటంతో మహిళలందరు ముక్త కంఠంతో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థే కావాలని, మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే కావాలని, మళ్లీ మాకు ఈ ప్రభుత్వమే కావాలని చేతులు ఎత్తి మరీ తెలిపారు. త్వరలోనే పిడుగురాళ్ల బైపాస్ పూర్తవుతుందని, ట్రాఫిక్ కష్టాలు ఇంక ఉండవన్నారు. అలాగే ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి వైపు దూసుకొని పోతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మెప్మా సీఎంఎం, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అనుగ్రహ పరిపూర్ణురాలు కానుకమాత



మాట్లాడుతున్న ఫాదర్ అంథోనిబాల

రెంటచింతల: పరిపూర్ణమైన హృదయంతో ప్రార్థించిన ప్రతి ఒక్కరిపై అనుగ్రహం కురిపించి వరాలిచ్చే తల్లి కానుకమాత అనుగ్రహ పరిపూర్ణురాలుగా కొనియాడబడుతుందని కారెంపూడి విచారణ గురువులు రెవ.ఫాదర్ నరిశెట్టి అంథోనిబాల అన్నారు. బుధవారం కానుకమాత చర్చి 174వ మహోత్సవ వేడుకలలో భాగంగా అంథోనిబాల జెండాను ఆవిష్కరించారు. అనంతరం కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి నేతృత్వంలో అతి పురాతనమైన కానుకమాత దేవాలయం ప్రాంగణంలో సహాయ గురువులు అగస్టీన్, రె.ఫాదర్లు కొణతం ఎలీషారాజు, ఎన్.పాపయ్యలతో కలిసి నవదిన ప్రార్థనలలో భాగంగా నిర్వహించిన సమిష్టి దివ్య పూజాబలిలో ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రీసభ కరుణ గల తల్లిగా గుర్తించిన మరియమాతను కుటంబ సమేతంగా నిత్యం ప్రార్థించినట్లు అయితే ఆ కుటంబంలో ఎల్లవేళల సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. సమిష్టి దివ్య పూజాబలిలో మఠకన్యలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి
- నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీవో, ఎంపీడీవో

గురజాల : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం తీసుకురావడం జరిగిందని రెవెన్యూ డివిజన్ అధికారి జి.వి.రమణాకాంత్ రెడ్డి అన్నారు. స్థానిక వీఎంఏఎస్ క్లబ్‌లో నియోజకవర్గ స్థాయి వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా ద్వారా ఎంతో మంది క్రీడాకారులు వారి ప్రతిభను కనబరచారన్నారు. మండల స్థాయిలో పోటీలు ముగిసి నియోజకవర్గ స్థాయిలో ఆడుతున్నారని ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయివీరారెడ్డి, వైస్ చైర్ పర్సన్ షేక్ బడేజానీ, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్, నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్ తదితరులున్నారు.

రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్‌గా కుందుర్తి



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ కుందుర్తి

పిడుగురాళ్ల: కార్పెంటర్ స్థాయి నుంచి రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్‌గా కుందుర్తి గురవాచారి ఎంపిక కావటం అనేది వైఎస్సార్‌సీపీలోనే సాధ్యమవుతుందని కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల వాటర్ ట్యాంక్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్‌గా కుందుర్తి గురవాచారి నియమితులైన సందర్భంగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించటం జరుగుతుందన్నారు. కుందుర్తి గురవాచారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్‌గా తనకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు చింతా వెంకట రామరావు, వైస్ చైర్మన్‌లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దీన్, కౌన్సిలర్ ముక్కంటి, కత్తెరపు వాసుదేవరెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, లతీఫ్, రామారావు, కుందుర్తి గురవాచారి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ అమ్మకాలపై కేసు నమోదు

ముప్పాళ్ళ: మద్యం అక్రమంగా అమ్మకాలు జరుపుతున్న వ్యక్తి వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు బుధవారం తెలిపారు. మండలంలోని ఇరుకుపాలెంకు చెందిన మొగిలి సాంబశివరావు అనే వ్యక్తి ఇంట్లో మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతని ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో 12 మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సాంబశివరావు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.